# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం

**- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ప్రత్యేకాధికారి ఖుష్బు కొఠారి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య**



సర్టిఫికేట్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఖుష్బు కొఠారి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** అర్హతున్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలన్నదే వైసీపీ ప్రభుత్వ ఉద్దేశమని అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమంను నెలరోజులపాటు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ ఉచితంగా వివిధ రకాల సర్టిఫికేట్లను అందజేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఖుష్బు కొఠారి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. పట్టణంలోని స్థానిక మేజర్ పంచాయతీ ఆవరణంలోగల వార్డు సచివాలయం-1 పరిధిలో జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపు సర్పంచ్ మీనుగ లలిత అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో జరుగగా వారితోపాటు ఎంపీడీఓ పి.చంద్రమౌళీ, ఉపసర ్పంచ్ జి.వన్నప్ప, బెస్త, ఎంబీసీ, కురుబ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు కె.వి.రమణ, జోగి వెంకటేష్, కె.గోవిందు, పీఏసీఎస్ చైర్మెన్ వడ్ల హాజీ షేక్షావలి, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ మీరాన్‌బాషా, వైకాపా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు యం.బసవరాజు, జేసీఎస్ కన్వీనర్ బి.ఆసీఫ్ తదితరులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సచివాలయం-1 పరిధిలో 60 మంది లబ్దిదారులకు 11 రకాల సర్టిఫికేట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీయం జగన్ ఏ సమస్య అపరిష్కృతంగా ఉండరాదన్న ఉద్దేశంతో అద్భుతమైన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం క్షణాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లగలుగుతున్నారన్నారు. పవన్ పుస్తకాలు చదవడంకాదు ప్రజలను చదవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, వార్డు సభ్యులు, ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# 19న పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో ఉచిత సామూహిక వివాహాలు

**- వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య**

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 19న పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు జరిపిస్తున్నామని వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులతో కలిసి ఉచిత సామూహిక వివాహాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఉచిత సామూహిక వివాహాలు చేసుకునే వధూవరులకు నూతన వస్త్రాలు, తాళిబొట్టు, మెట్టెలు, రైస్ కుక్కర్ ఇస్తామని వివాహానికి వచ్చే వారికి ఫలహారం, భోజన సౌకర్యం కల్పించామన్నారు. ఇతర వివరాలకు 75699 81330, 95538 71476లకు సంప్రదించాలన్నారు.

# స్థలం విషయంలో ఘర్షణ-ఇద్దరికి గాయాలు

**-కేసు నమోదు చేసిన పోలీసులు**



గాయపడిన దేవేంద్ర

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు జాతీయ రహదారికి పక్కనగల ప్రైవేటు స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరుగగా తండ్రీ కొడుకులు దేవేంద్ర, భాస్కర్ గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా స్థలం విషయంలో పక్క పక్కన నివశిస్తున్న వారి మధ్య విభేదాలు ఉన్నాయని ఈ క్రమంలోనే ఖాళీ స్థలంలో షెడ్డు వేశారంటూ ఘర్షణ జరుగగా ఇరువురు గాయపడ్డారన్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అనంతరం వారి పిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్, 7 హెల్పర్ పోస్టుల భర్తీకు నోటిఫికేషన్

**- అర్హత కల్గిన మహిళలు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలి**

**- ఐసీడీఎస్ ప్రాజెక్టు ఉరవకొండ సీడీపీఓ డా॥బి.ఎన్.శ్రీదేవి**



విలేఖరులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ డా॥బి.ఎన్.శ్రీదేవి

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగావున్న ఒక అంగన్‌వాడీ వర్కర్ పోస్టుతోపాటు 7 హెల్పర్ పోస్టుల భర్తీకు నోటిఫికేషన్ విడుదలైందని ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీఓ డా॥బి.ఎన్.శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని మోపిడి-2 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్ (ఓసీ), విడపనకల్లు మండలం గడేకల్లు-4లో (ఓసీ), హావళిగి-6లో (వీహెచ్ లోకోమోటర్ డిసబిలిటి), వెంకటాంపల్లి-1 (ఓసీ), మోపిడి-2 (బీసీ-బీ), ఉరవకొండ-17 (ఓసీ), పాత కడమలకుంట (ఓసీ), వెంకటాంపల్లి పెద్ద తండా-1 (ఎస్టీ)కు హెల్పర్ పోస్టులు రిజర్వు చేయడం జరిగిందన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, వివాహితులై స్థానికంగా నివాసం ఉండవలెనన్నారు. 01-07-2023 నాటికి దరఖాస్తు చేయు అభ్యర్థుల వయసు 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలలోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల్లో 21 సంవత్సరాలు నిండినవారు లేకపోతే 18 సంవత్సరాలు నిండినవారు కూడా అర్హులేన న్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం 11,500 రూపాయలు, హెల్పర్‌కు 7,000 రూపాయలు నెలకు అందించడం జరుగుతుందన్నారు. అర్హులు 10వ తరగతి ఉత్తీర్ణత ధృవీకరణ పత్రం, పుట్టిన తేదీ, వయసు నిర్ధారణ పత్రం, కులము, నివాసం (ఎస్సీ, ఎస్టీ, బీసీలు), వికలాంగత్వము కల్గినవారు సంబంధిత అధికారి ధృవీకరించిన పత్రం, సరికొత్త ఫోటోతో గెజిటెడ్ అధికారిచే ధృవీకరణ చేసి దరఖాస్తుతోపాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 13 నుంచి 19వ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించబడిందని సీడీపీఓ వివరించారు.

# రోడ్డును బాగు చేయండి మహా ప్రభో



మురికి కుంటను తలపిస్తున్న రోడ్డు

**గుడిబండ, జూలై 13 ప్రభాతవార్త :** మండల కేంద్రం నుంచి కొంకల్లు గ్రామానికి వెళ్లే రహదారి దిన్నేహట్టి గ్రామంలో మురికి కాల్వను తలపిస్తుందని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి రహదారిపై నీరు చేరి నిలువ ఉండడంతో ఈ రహదారిలో ప్రయాణించే అనేక మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏ మాత్రం అదుపుతప్పిన ప్రమాదం సంభవిస్తుందని ఇప్పటికైనా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రహదారిలో ఉన్న గుంతలను మట్టితో పూడ్చి ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారిని బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు

**అగళి, జులై 13 ప్రభాతవార్త :** ఆధార్ అప్‌డేట్ కోసం మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అగళి, నర్సాంబుది సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కోసం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆధార్‌కార్డులో పేరుగానీ, ఏజ్, డోర్ నెంబర్ ఇలాంటివి ఏమైనా తప్పులు దొర్లి ఉంటే ప్రభుత్వంనుంచి అందించే సంక్షేమ పథకాలు లబ్దిదారులకు అందవు. దీతోపాటు ఆధార్ కార్డు తీసి 10 సంవత్సరాలు అయిన వారు కూడా అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాలకు వెళ్తున్నారు. నూతన ఆధార్‌కార్డులతోపాటు పాత ఆధార్‌కార్డులో తప్పులను సరిచేసి, ఆయా ఆధార్ సెంటర్ల వద్ద వందలాది మంది వేచి ఉన్నారు. చకచక పనులు చేయక ఆలస్యం చేస్తున్నారని, ఒకసారి అప్‌డేట్ చేసినవి అది ఫెయిల్ కావడంతో మరోసారి అప్‌డేట్ కావడంతో, మరల వచ్చిన వారికి సత్వరమే ఆ పనులు చేసిపెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధార్ కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్‌ను సత్వరమే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఈ విషయం శ్రద్ద చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జగన్న సురక్షలో సజావుగా ప్రజల పనులు

**అగళి, జులై 13 ప్రభాతవార్త :** ఆలూడి గ్రామంలోజగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ప్రజల సమస్యలను సజావుగా చేయడానికి ఇది చక్కని ప్లాట్‌ఫాం అని ఎంపిపి రేణుకా కామరాజు అన్నారు. క్యాస్ట్ ఇన్‌కం సర్టిఫికెట్, పుట్టిన తేది, రేషన్‌కార్డులో పేర్ల తొలగింపు, యాడింగ్‌లాంటి పనులతోపాటు కొత్త రేషన్‌కార్డులకు అవకాశం ఉందని తెలిపారు. పాస్‌పాస్ పుస్తకాలకు దరఖాస్తు చేసుకోవడానికి మ్యుటేషన్ చేసుకోవచ్చుని, అన్ని రకాల సమస్యలు పరిష్కరించుకోవడానికి జగనన్న సురక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, తహశీల్దారు జమానుల్లా ఖాన్, ఆర్‌ఐ గుర్రన్న, ఏఓ శ్రీనివాసరావు, విఆర్‌ఓ నాగరాజు, ఏఓ శేఖర్‌నాయక్, పంచాయితీ కార్యదర్శిలు, అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచు బసవరాజు ఎంపిటిసి బసవరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొంకల్లులో జగనన్న సురక్ష కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ రామారావు

**గుడిబండ, జులై 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొంకల్లు గ్రామ పంచాయితీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ రామారావు, తహశీల్దారు నాగభూషణం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నాగభూషణం, డిప్యూటీ తహశీల్దారు రామ్‌భూపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వీర నరేష్, సర్పంచు కవిత ఓబన్న,మండల సచివలాయాల కన్వీనర్ కొంకల్లు శివకుమార్, సచివాలయాల కన్వీనర్లు కొంకల్లు రమేష్, హనుమంతరాయుడు, రాజేంద్ర, గ్రామ పంచాయితీ కార్యదర్శిలు రమేష్, హరీష్, అమరేష్, విఆర్‌ఓ రాజు, డీలర్ చిత్తన గిరియప్ప, మైనార్టీ నాయకుడు నయాజ్, గృహ సారధులు గ్రామ వాలెంటీర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే రేసులో నేనుంటా..!

**- టిడిపి అధికార ప్రతినిధి పి.కృష్ణమూర్తి**



విలేకర్లతో మాట్లాడుతున్న టిడిపి అధికార ప్రతినిధి పి.కృష్ణమూర్తి

**సోమందేపల్లి, జులై 13 ప్రభాతవార్త :** త్వరలో జరగబోవు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పెనుకొండ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను కూడా ఉంటానని ఆ పార్టీ అధికార ప్రతినిధి కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం పెనుకొండ సమీపంలోని కియా మోటార్ సంస్థ వారు నిర్వహించిన ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సోమందేపల్లి వై.జంక్షన్‌లో విలేకర్లతో కష్ణమూర్తి మాట్లాడుతూ.. అధజష్టానం ఆదేశిస్తే తెలుగుదుఏశం పార్టీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా పని చేయడానికి సిద్దంగా ఉన్నట్లు ప్రకటించారు. అదే సమయంలో పెనుకొండ మాజీ ఎమ్మెల్యే పార్థసారధికి సీటు దక్కనిపక్షంలో రెండవ ఆప్షన్‌గా తాను ముందుంటానని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పెనుకొండలో టీడీపీలో రెండు వర్గాలుగా చీలి, విభేదాలు ముదిరి, పార్టీ పరువు బజారున పడే పరిస్థితి దాపురించిందన్నారు. తమ నాయకుడు చంద్రబాబునాయుడు అన్ని కోణాల్లో ఆలోచించి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయిస్తారని అయితే తాను మొదట పార్థసారధికే ప్రాధాన్యత ఇస్తానని ఆయనకు రాని పక్షంలో అదే సామాజిక వర్గానికి చెందిన తనకు సీటుకేటాయించాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. పెనుకొండ కియా పరిశ్రమ చంద్రబాబు చలవ వల్లే పెనుకొండకు రావడం జరిగిందన్నారు. నేడు వేలాది మంది యువత కియాలో ఉద్యోగాలు సంపాదించి తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చుకోవడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతప్రభుత్వం ఎంపిగోరంట్లమాధవ్, ఎమ్మెల్యేశంకర్ నారాయణలు తామేదో పరిశ్రమనుతెచ్చినట్లు తమ ఆధ్వర్యంలోనడుస్తోందన్న భ్రమలు వీడాలని పేర్కొన్నారు. ఏది ఏమైనా పెనుకొండ అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే జరుగుతుందని, జరగబోవు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎవరైనా భారీ మెజార్టీతో పట్టం కట్టనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు మరికొందరు ఉన్నారు.

# కియా పరిశ్రమ రాష్టానికి తెచ్చిన ఘనత చంద్రబాబునాయుడుది

**- తేదేపా రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవిత**



మాట్లాడుతున్న సవిత

**పెనుకొండ, జులై 13 ప్రభాతవార్త :** కియా కార్ల పరిశ్రమ రాష్టానికి తెచ్చిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవిత అన్నారు. గురువారం పట్టణంలోని ఆమె కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నేటికీ కియా కంపెనీలో పది లక్షల కార్ల ఉత్పత్తి చేయడం గర్వకారణం అన్నారు. వైసీపీ మంత్రులు ఎంపి, ఎమ్మెల్యేలు, నాయకులు కియా కంపెనీ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారని ఉత్తర కుమార ప్రగల్బాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు చేసే అసత్య ప్రచారాలను ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని ఆమె మండి పడ్డారు. గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి కియా కంపెనీ ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చినది చంద్రబాబునాయుడు కాదా అని ప్రశ్నించారు.

# అంగన్‌వాడి పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**గుత్తి, జులై 13 ప్రభాతవార్త :** గుత్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా వున్న అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ ఢీల్లీశ్వరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని నరసాపురం గ్రామంలో ఒక వర్కర్ పోస్టు ఖాళీగా వుందన్నారు. అదేవిధంగా ఈద్గావీధి, కాల్వగడ్డ-2, స్వీపర్స్‌కాలనీ, ఎసిఎస్‌మిల్లుకాలనీ, జక్కలచెరువు ఆర్‌ఎఫ్‌లో ఒక్కటి చొప్పున 5 హెల్పర్‌పోస్టులు ఖాళీగా వున్నాయన్నారు. స్థానికంగా నివాసం వుంటూ 10వతరగతి ఉతీర్ణులైన వారు తమ కుల, జనన సర్టిఫికెట్లను దరఖాస్తు ఫారంతో అందచేయాలని ఆమె సూచించారు. ఈ నెల 19వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# విధులకు రాని అంగన్‌వాడీ టీచరమ్మ

**- గ్రామస్తులు ప్రశ్నిస్తే వారిపైనే దుర్భషలాడుతున్న టీచరమ్మ**



తాళం వేసిన అంగన్‌వాడీ సెంటర్



అంగన్‌వాడీ టీచర్‌పై ఫిర్యాదు చేస్తున్న గ్రామ వాలెంటీర్

**మడకశిర టౌన్, జులై 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జాడ్రహల్లి గ్రామంలో ఉన్నటువంటి అంగన్‌వాడీ స్కూల్‌లో విధులకు టీచర్ సరిగా విధులు నిర్వర్తించడం లేదని వాలెంటీర్ గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో సైతం ఫిర్యాదు చేసినప్పటికీ స్పందిం చడం లేదు. సిడిపిఓ కార్యాలయానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాడ్రహల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం పనితీరు ఈ విధంగా ఉంటే. మరి ఇతర ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై అనుమానాలు వెల్లుబుక్కుతున్నాయి. ముఖ్యంగా పర్యవేక్షణలోపంతో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సైతం అధిక సంఖ్యలో ఖాళీలు ఉండడం వల్ల పర్యవేక్షణ లోపించినట్లు పలువురు పేర్కొన్నారు. గ్రామ వాలెంటీర్ రామాంజినేయులు మాట్లాడుతూ.. కొద్దిరోజుల క్రితమే అంగన్వాడి టీచర్లపైన స్పందనలో ఫిర్యాదు చేశామని తెలిపారు. నెలకు రెండు మూడు రోజులు మాత్రమే స్కూల్ తలుపులు ఓపెన్ చేస్తారని ఆమె సరిగా విధులలో ఉండదని అతను ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అంగన్‌వాడీ స్కూల్ ఓపెన్ చేయించి చిన్న పిల్లలకు న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరారు.

# లబ్దిదారుల చెంతకే సర్టిఫికెట్లు



లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం మేరకు అవసరమైన లబ్దిదారులకు సర్టిఫికెట్లను కాలయాపన లేకుండా అందచేస్తామని మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్‌చైర్‌పర్సన్ వరలక్ష్మి పేర్కొన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని 3వ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 296మంది కుల ధృవీకరణ, 236 మందికి ఆదాయ ధృవీకరణపత్రాలను అందచేశారు. దరఖాస్తుదారుల ఇంటికివెళ్లి సర్వేచేయించి సర్టిఫికెట్లు అందచేయడం జరుగుతుందని వారుతెలిపారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లుఖాజాఖాన్, వరదరాజులు, రాజేశ్వరి, ఇన్‌చార్జ్ సుధాకర్, మేనేజర్ మురళీధర్, చంద్ర, ఇమాం హుసేన్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కరిడికొండ గ్రామంలో ఎంపిపివిశాలాక్షిఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచు రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపితో పాటు ఎంపిడిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి సర్టిఫికెట్లుఅందచేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు కాశీంవలి, సిబ్బంది పాల్గొన్నారు.

# పంటసాగుకాని పొలాల్లో ప్రత్యామ్నాయపంటలు



సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 13 ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్‌లో పంట వేయని పొలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకై కావాల్సిన విత్తనాల కోసం నివేదికలు రూపొందించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి, ఎడిఎ వెంకటరాముడు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎం కిసాన్ యోజన కోసం రైతులు ఈకెవైసి చేయించుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో వుంచాలని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఆయా మండలాల ఎఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సమస్యపై ఉద్యమం



సిపిఐ నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, జూలై 13 ప్రభాతవార్త :** గుత్తి మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఉద్యమం చేపడతామని సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి రామాంజినేయులుయాదవ్, మండల కార్యదర్శి రామదాసులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక చెరువులో నీరు లేనందున భూగర్భజలాలు అడుగంటాయని చెరువు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని కేవలం ట్యాంకర్ల ద్వారా అరకొర నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. విపక్షాలతో కలిసి ఉద్యమం చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, మాబు, వెంకటనాయుడు, నరసింహయ్య, మహమ్మద, తదితరులు పాల్గొన్నారు.

# నూతన మున్సిపల్ వైస్ చైర్మన్‌ల ప్రమాణ స్వీకారోత్సవం





నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్లు దృశ్యం

**ధర్మవరం, జూలై 13, ప్రభాతవార్త:** పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు గురువారం ప్రిసైడింగ్ ఆఫీసర్ తిప్పేనాయక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నల ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్-1, మున్సిపల్ వైస్ చైర్మన్-2 యొక్క ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేముల జయరాం రెడ్డి(2వ వార్డు)కౌన్సిలర్లు, మూడో వార్డుకు చెందిన శంకర తేజేశ్వర్ ప్రతిపాదించగా, 14వ వార్డుకు చెందిన గజ్జల సీవయ్య మున్సిపల్ చైర్మన్-1గా బలపరిచారు. తదుపరి ఎస్.శంషాద్ బేగం(38వ వార్డు)ను 11వ వార్డుకౌన్సిలర్ అత్తర్‌జిలాన్‌భాషా ప్రతిపాదించగా, 9వవార్డుకౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ మున్సిపల్ వైస్ చేర్మన్-2గా బలపరిచారు. ఎన్నికల చట్టంప్రకారం వీరిఇరువురికి ఎవరుపోటి రాకపోవడంతో ఏకగ్రీవంగా ఇద్దరిని ఎంపిక చేసినట్లు ప్రిసిడింగ్ ఆఫిషర్, ఆర్డీఓ తిప్పేనాయక్ ఈధికారపూర్వకంగా ప్రకటించారు. వీరికి ఎమ్మెల్యే, చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్, టిపిఓ సాయిప్రసాద్, ఈఈ సత్యనారాయణ, డిఈ వన్నూరస్వామి, కృష్ణరావు, సుధారాణి, మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, మాజీ మున్నిపల్ చైర్మన్లు లింగం నిర్మల, భాగ్యలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లిసాయికుమార్, పునుజూరి నాగరాజు, వార్డు కౌన్సిలర్లు, కో అప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెస్త కుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 15 సెంట్ల స్థలం కేటాయింపు

**- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులను సన్మానించిన బెస్త కులస్తులు**



స్థలం కేటాయించిన ఉత్తర్వులను బెస్త సంఘానికి అందిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** బెస్త కుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పబ్లిక్ పర్పస్ స్థలం 15 సెంట్లను కేటాయించింది. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో గురువారం బెస్త కుల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె.వి.రమణ, సర్పంచ్ మీనుగ లలిత, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైకాపా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు యం.బసవరాజు, ఎంబీసీ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు జోగి వెంకటేష్, కె.గోవిందు ముఖ్య అతిధులుగా హాజరై పంచాయతీ తీర్మాణ పత్రాన్ని కుల పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బెస్తల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, గౌరవాధ్యక్షుడు చంద్రబాబు, వివిధ నియోజకవర్గాల అధ్యక్ష కార్యదర్శులు నారాయణస్వామి, నాగరాజు, సిద్ధు, సత్యం, వెంకి, ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పయ్య, కార్యదర్శులు వెంకటేష్, ఎర్రిస్వామి, రామన్న, నాయకులు అశోక్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఆమిద్యాల బెతస్త ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు షోకాజ్ నోటీసు జారీ

**- విద్యార్థి సంఘాల పిర్యాదుతో ఆకస్మికంగా తనిఖీ చేసిన డీవైఈఓ**

**- పాఠశాలలో పుస్తకాలు, యూనిఫారమ్‌ల విక్రయాలపై చర్యలు**



విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శంకర్‌ప్రసాద్

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో బెతస్త ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యానికి గుత్తి డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) శంకర్‌ప్రసాద్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. పలు విద్యార్థి సంఘాలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక ఫీజుల వసూళ్ల, స్టేషనరీ అమ్మకాలపై జిల్లా విద్యాధికారికు పిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు డీవైఈఓ గురువారం ఆసక్మికంగా తనిఖీ చేశారు. ఈక్రమంలో పాఠశాలలో పాఠ్య, నోటు పుస్తకాలతోపాటు యూనిఫారమ్‌లు విక్రయిస్తున్నట్లు తేలడంతో ఆయన ఈమేరకు చర్యలు తీసుకున్నారు. ఈక్రమంలో డీవైఈఓను జీవీఎస్‌ఎస్ నాయకులు పురుషోత్తం, ఎంఆర్‌సీఎస్ నాయకులు పృధ్వీరాజ్, బీజేవైఎం నాయకులు రమేష్, సురేష్, బాలకృష్ణలు కలిసి మండల వ్యాప్తంగా జరుగుతున్న ఫీజుల దోపిడిను వివరించారు. మండల వ్యాప్తంగా విద్యా వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతున్నా మండల విద్యాశాఖాధికారి పట్టించుకోవడంలేదని డీవైఈఓ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన డీవైఈఓ శంకర్‌ప్రసాద్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారమ్‌లు, స్టేషనరీ విక్రయించరాదని అలా ఏ పాఠశాలలో విక్రయించినా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సిరులు కురిపించే చిరు ధాన్యాల పంటలు సాగు చేయండి..!

**- జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్**



80 సంవత్సరాల వయసు దాటిన వృద్ధ రైతులను సన్మానిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త :** సిరులు కురిపించే చిరు ధాన్యాల పంటల సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ అన్నారు. నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం ఉండబండ గ్రామంలో గురువారం జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాల సాగుపై అవగాహన సదస్సు జరుగగా గ్రామ సర్పంచ్ శంకర్‌గౌడ్, పాల్తూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ దేవరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాల వయసు దాటిన విశ్రాంత రైతులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో షాలువాలుకప్పి ఘనంగా సన్మానించారు. నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ 100 సంవత్సరాల పూర్వం మన పూర్వీకులు చిరు ధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు, అరికలు, అందు కొర్రలను అధికంగా పండించి వాటినే ఎక్కువగా ఆహారంగా తీసుకొని దీర్ఘాయుష్షు పొందారన్నారు. అయితే కాలక్రమేనా నీటి లభ్యత, వ్యవసాయ విప్లవం, దేశాల మధ్య ఆధిపత్య ప్రభావంతో చిరు ధాన్యాల సాగు కనుమరుగై నీటి ఆధారిత పంటలైన వరి, గోధుమల సాగు చేయడం వాటినే ఆహారంగా తీసుకోవడం అధికమైందన్నారు. దీంతో అవసరానికి మించి గ్లూకోజ్ శరీరంలోకి వెళ్లి కొవ్వు అధికమై బరువు పెరుగడం తద్వారా దీర్ఘకాలిక తదితర రోగాలు, కీళ్ళు, కాళ్ల నొప్పులు, అరుగుదల సమస్యల బారిన పడాల్సి వస్తోందన్నారు. ఆయా సమస్యలను అధిగమించాలంటే చిరు ధాన్యాల సాగును పెంచి ఎక్కువగా వాటిని భుజిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ వ్యాధులు, ఊబకాయ సమస్యలను అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, జైకిసాన్ ఫౌండేషన్ ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి**



రికార్డులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే దృశ్యం

**అమరాపురం, జూలై 13, ప్రభాతవార్త:** జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సయివాలయం -2 వద్ద జగనన్న సురక్ష పథకంపై గ్రామ సభను ఎంపిటిఓ మునిస్వామి, తహశీల్దార్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా 98 శాతం హామీలను నెరవేర్చిన నాయకునిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి నిరుపేదలకు లబ్ది చూకూర్చాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం అధికారుల సమక్షంలో మంజూరైన రికార్డులను లబ్దిదారులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం నందు ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శి భాస్కర్, ఉషా, పిఏసిఎస్ చిక్కన్న, డైరెక్టర్ వీరకేతరాయప్ప, మండల సచివాలయ ఇంచార్జ్ శ్రీనివాసరెడ్డి, స్థానిక వైకాపా నాయకులు త్రిలోకనాథ్, జెకె మూర్తి, సిద్దప్ప, కెంచప్ప, ప్రసాద్, విఆర్వో కీర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

07ATP13_07ATP13.qxd 13-07-2023 PM 10:41 Page 1



## సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

-కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, జూలై 13 ప్రభాతవార్త**


పథకాలు వివరిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యమని యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లిలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందు తున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల ప్రజలకు నవరత్న సంక్షేమ పథకాలను అందచేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల తోడ్పాటునందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల వసతిగృహానికి గ్రైండర్ వితరణ


గ్రైండర్ అందచేస్తున్న దృశ్యం

**యాడికి, జూలై 13 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలోని ఆదర్శపాఠశాల వసతి గృహానికి గురువారం ఫ్యాక్టరీ యజమాని సుంకర సుధాకర్, తూట్రాళ్లపల్లి సర్పంచు సంజీవరాయుడు ఆధ్వర్యంలో వైస్‌ప్రిన్సిపాల్ గీతాంజలి, వార్డెన్ సత్యవతిలకు గ్రైండర్ అందచేశారు. ఆదర్శపాఠశాల వసతి గృహంలో వివిధ రకాల వంటలకు ఉపయోగించే ముఖ్యమైన పరికరం గ్రైండర్. ఆ పరికం లేదని తెలుసుకున్న సర్పంచు సంజీవరాయుడు తన స్నేహితుడైన సుంకర సుధాకర్‌కు విషయం తెలియచేసి దాదాపు 5 వేల రూపాయల విలువ చేసే గ్రైండర్‌ను వార్డెన్ సత్యవతికి అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు శంకర్‌నాయక్, బాష, భాస్కర్, రంగారెడ్డి, ఉమామహేశ్వరి, సిబ్బంది భీమేష్, రషీదు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు


జగనన్న కాలనీలో బోరు నుండి వస్తున్న నీరు

**యాడికి, జూలై 13 ప్రభాతవార్త**

మండల కేంద్రం పిన్నేపల్లి రోడ్డు సమీపంలో వున్న జగనన్నకాలనీలో ఏర్పాటు చేసిన బోరును ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్విచ్‌ఆన్ చేసి గురువారం లాంచనంగా ప్రారంభించారు. జగనన్న కాలనీలో దాదాపు 350 మంది గృహ వినియోగదారులు తమ తమ ఇళ్ల నిర్మాణం సమయంలో నీటి అవసరం ఎంతైనా వుంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు జగనన్న కాలనీ ఏర్పాటు సమయంలో బోరు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు ఇంచుల మేర నీరు పడింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, బాలరమేష్‌బాబు, బ్రహ్మానందరెడ్డి, సర్పంచు పండు అనురాధ, ఎంపిడిఓ లక్ష్మినారాయణ, హౌసింగ్ ఎఇ ప్రశాంత్‌కుమార్, ఎంపిటిసిలు నాగరాజు, రామమోహన్, తలారి నాగేష్, రషీదు, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**యల్లనూరు, జూలై 13 ప్రభాతవార్త**

మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం కుష్టువ్యాధిపై విద్యార్థులకు తిమ్మంపల్లి పిహెచ్‌సి హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కుష్టువ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చికిత్స గురించి తెలియచేశారు. అదేవిధంగా ప్రతి గురువారం రక్తహీనత రాకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన ఐరన్ మాత్రల యొక్క ప్రాధాన్యత తెలిపి ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలను విద్యార్థులు తప్పకుండా తీసుకోవాలన్నారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాము, ఎంఎల్‌హెచ్‌పి సౌజన్య, ఆశాకార్యకర్తలు భార్గవి, జయనాగలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముగ్గురిపై గృహహింస చట్టం కింద కేసు నమోదు

**పుట్లూరు, జూలై 13 ప్రభాతవార్త**

మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన నాగసులోచన ఫిర్యాదు మేరకు భర్త నరేష్, అత్తామామలపై గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి. పెద్దపప్పూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన నరేష్‌తో నాగసులోచనకు వివాహమై 6 సంవత్సరాలు అయింది. కాగా కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో పాటు భర్త, అత్తామామల వేధింపులు తాళలేక నాగసులోచన తన పుట్టింటికి చేరుకుందన్నారు. దీంతో పుట్లూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## జూదరుల అరెస్ట్ - రూ.5,300 స్వాధీనం

**పుట్లూరు, జూలై 13 ప్రభాతవార్త**

మండలంలోని నారాయణపల్లి గ్రామంలో జూదమాడుతున్న వారిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి జూదమాడుతున్న 5 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 5,300 రూపాయలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్ల పంపిణీ

**పుట్లూరు, జూలై 13 ప్రభాతవార్త**


దృవపత్రాలను అందచేస్తున్న ఎంపిడిఓ యోగానందరెడ్డి

మండలంలోని వెంగన్నపల్లి, కోమటి కుంట్ల గ్రామాల సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ యోగానంద రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటికి వచ్చి వారికి ఏదైనా స్కీమ్స్‌లో సమస్యలు వున్నాయా, అర్హత వుండి కూడా పథకాలు రాకున్నా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే వారికి అవసరమైన సర్టిఫికెట్లను తెలుసుకుని వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకుని సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసి తహశీల్దార్ చేత అప్రూవ్ చేయించి ప్రింట్ తీసి వాటిని ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా వెంగన్నపల్లి సచివాలయంలో 167, కోమటికుంట్ల సచివాలయంలో 184 సర్టిఫికెట్లను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, సర్పంచులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలో వ్యక్తిపై దాడి


సాయిశ్రీకాంత్ విచారిస్తున్న పోలీసులు

**తాడిపత్రిఅర్బన్, జూలై 13 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో గురువారం సాయిశ్రీకాంత్ అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. గాయపడిన సాయి శ్రీకాంత్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితుడు మీడియాతో మాట్లాడుతూ ఆరుమంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి సోషియల్ మీడియా లో ఓ ప్రజాప్రతినిధిపై అసభ్యకర పోస్టులు పెడతావా అంటూ తనపై దాడి చేశారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ధరణిబాబు దాడి జరిగిన సంఘటనా స్థలానికి శ్రీకాంత్‌ను తీసుకెళ్లి విచారిస్తున్నారు.

## 17న శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి నేరేడు పళ్లతో అలంకారం


శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామి మూలవిరాట్టు

**తాడిపత్రిఅర్బన్, జూలై 13 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన పురాతన శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ఈ నెల 17వతేదీ సోమవారం నేరేడు పళ్లతో అభిషేకం, అర్చన, అలంకారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యశర్మ, చంద్రశేఖర్‌శర్మ, మహేష్‌శర్మ, గిరిశర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మ, ఆలయ కమిటీచైర్మన్ పివిఎస్ ఆంజనేయులు తెలియచేశారు. ఆషాఢ మాసం బహుళ అమావాస్య, సోమావతి అమావాస్యని పురస్కరించుకుని ఉదయం మహాగణపతి పూజ, స్వామివారికి పంచామృతాభిషేకము, పళ్ల రసాలతో అభిషేకం, జంభూఫలముల (నేరేడుపళ్ళు)తో స్వామివారికి అభిషేకము, అర్చన, అలంకారం, పంచహారతులు, మహామంగళహారతి, తదితర పూజా కార్య క్రమాలు నిర్వహించన్నారు. అనంతరం తీర్థప్రసాదములు వినియోగం కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కావునా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీపార్వతిపరమేశ్వరుల కృపకు పాత్రులు కావాలని వారు తెలియచేశారు.



## జగనన్నసురక్ష కార్యక్రమంలో తహసిల్దార్

లబ్ధిదారులకు దృవపత్రాలు అందజేస్తున్న ఎంపిడిఓ శకుంతల

**నల్లచెరువు, జూలై 13, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఉబిచెర్ల సచివాలయం నందు గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తహసిల్దార్ రవికుమార్, ఎంపిడిఓ శంకుతల, ఎంపిటిసి నరసింహారెడ్డి,జేసిఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్, మండల అధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ వాలంటీర్‌ల ద్వారా గుర్తించిన సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రశ్నించడమే జగనన్న సురక్ష కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వం ఏలక్ష్యంతో అయితే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు దృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్‌లు, గృహ సారథులు ,వైసిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నారాలోకేష్ యువగళం పాదయాత్రకు మద్దతుగా బైకు ర్యాలీ

పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగుదేశం శ్రేణులు



**కదిరి, జూలై 13 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రదాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు.

ముందుగా కవులేపల్లి వద్ద ఉన్న పిబిఆర్ ఫంక్షన్ వద్ద నుంచి జీమాన్ సర్కిల్, ఇందిరమ్మ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా కాలేజ్ సర్కిల్, టవర్‌క్లాక్ తదితర చోట్ల బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున తరలి రావడంతో కదిరి పసుపుమయమైంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. యువనాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా ఆయనకు మద్దతుగా కందికుంట ఆదేశాల మేరకు పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించామనాన్రు. వైకాపా ప్రభుత్వం అరాచకాలపై ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు రాజశేఖర్, రాజేంద్రనాయుడు, చంద్రశేఖర్, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఉర్దు అకాడమి చైర్మన్ నదీమ్ అహ్మద్


నదీమ్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

**కదిరి, జులై 13 ప్రభాతవార్త**

మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉర్దు అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్ తెలిపారు. గురువారం పట్టణంలోని కోర్టు రోడ్డులో ఉన్న ఉర్దు అకాడమి గ్రంథాలయంను స్తానిక శాసనసభ్యులు డా.పివి.సిద్దారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం మైనార్టీ వర్గాకలు పెద్ద పీట వేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో ఉర్దు అకాడమి గ్రంథాలయం మైనార్టీలకు ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. ఉర్దు గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు అయిందని త్వరలోనే స్థలం కేటాయించి నిర్మాణపు పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజిమున్నీసా సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తున్న 'సామకోటి'


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సామకోటి

**నల్లమాడ జూలై 13 ప్రభాతవార్త,**

మారుమూల గ్రామంలో జన్మించి అభాగ్యుల జీవితాల్లో వెలుగు నింపుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే కాక నిరుపేదలు ఎవరైన అనారోగ్యంతో బాధపడుతున్న, ఆర్థికస్థోమతలేక చదువులో వెనకబడి ఉన్న, ఏదైన ప్రమాదం, అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను ఎప్పటికప్పుడు పరామర్శిస్తూ, బాధిత కుటుంబాలకు తన వంతు ఆర్థికసాయం అందించడంతో పాటు వారికి మనోధైర్యం నింపుతున్నారు. గురువారం మండలంలోని కుటాలపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వెంకటరామిరెడ్డి, ప్రమాదంలో గాయపడ్డ అనీల్ కుటుంబాలను సామకోటి ఆదినారాయణ పరామర్శించి వారికి ఆర్థికసాయం అందజేశారు.ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా తనకున్న దాంట్లో ఇతరులకు సహాయం చేయడం తనకు జన్మనిచ్చిన తల్లితండ్రులు, దేవుడిచ్చిన వరమన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ మైలేశంకర, బుట్టినాగభూషణంనాయుడు, శ్యాంసుందర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గంగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శీనా, వెంకటేష్, అరవిందు, కర్ణ తదితరులు ఉన్నారు.

## వేలం పాట నిర్వహించిన ఆలయ ఈఓ


దేవస్థానం నందు వేలం పాట నిర్ణయిస్తున్న ఆలయ ఈఓ రామాంజినేయులు

**నల్లచెరువు, జూలై 13, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నిత్యం పూజలందుకుంటున్న శ్రీపాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానం నందు గురువారం దేవాదయ ధర్మాదాయ శాఖ వారి ఆదేశాల మేరకు దేవస్థానం ఆవరణంలో స్వామివారికి భక్తులకు టెంకాయలు పూజా సామాగ్రి, పూల హారాలు, పార్కింగ్ భక్తులకు విక్రయించేందుకు ఆలయంలో ఆవరణంలో వేలం పాట నిర్వహించారు. శ్రావణమాసం ఒక నెలకు( 17.08.2023 నుండి 14.09.2023) మాత్రమే ఈ వేలం వర్తిస్తుందని ఆలయ ఈఓ రామాంజినేయులు తెలిపారు. వేలం పాటలో టెంకాయలు, పూజా సామాగ్రి విక్రయించుకొనుటకు కె. రాములయ్య రూ. 400000 వేలం పాటి హక్కు దక్కించుకున్నారు. అదేవిధంగా రూ. 67000 వేలం పాట పాడి పూలహారాలు, విడిపూలు విక్రయించుకునుటకు హక్కు దక్కించుకున్నారు. పార్కింగ్ రుసుము వసూలు చేసుకొనుటకు రూ. 73000 వేలం పాట పాడి ఎస్. గోవిందు హక్కు దక్కించుకున్నారు. వీరందరూ వేలం పాటలో స్వామివారికి పూజా సామాగ్రి విక్రయించుకొనుటకు దేవాలయ శాఖ వారు వీరికి హక్కును నిర్ణయించడం జరిగింది. ఈ వేలం కార్యక్రమంలో ఆలయ ఈఓ సి. రామాంజినేయులు, ఆలయ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు, ఆలయ చైర్మెన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, యంపిపి రమణారెడ్డి, ఉత్తన్న, పాలకమండి సభ్యులు సూర్యనారాయణ, గోవింద్‌రెడ్డి, రామచంద్ర, ఆలయ అర్చకులు ఆంజినేయదాస్, నాగరాజు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్న కొడుకే కాలయముడు


హత్యకు గురైన గంగులమ్మ

**తనకల్లు, జూలై 13, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొర్తికోట గ్రామానికి చెందిన గోల గంగులమ్మ(77) గురువారం తన కొడుకు చేతిలో దారుణంగా హత్యకు గురవ్వడం జరిగింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై రాంభూపాల్ యాదవ్ హుటాహుటిన తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను విచారించడం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మృతురాలు గంగులమ్మ పెన్షన్ డబ్బులు ఇవ్వకపోవడం కోపోద్రిక్తుడైన తన కుమారుడు మద్యం సేవించి తన తల్లి అయిన మృతురాలు గంగులమ్మను కట్టెతో కొట్టి చంపి పరారైనట్లు వారు తెలిపారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. గ్రామస్తులు పోలీసులతో మాట్లాడుతూ అలాంటి దుర్మార్గుడికి కఠిన శిక్షన పడేలా చూడాలని పోలీసులకు తెలిపారు. నింధితుడిని వెంటనే పట్టుకోవడానికి ప్రయత్నిస్తామని ఎస్సై రాంభూపాల్‌యాదవ్ తెలిపారు.

## యువకుడు ఆత్మహత్య


కామేశ్వర్‌రెడ్డి ఫైల్‌ఫొటో

**తనకల్లు, జూలై 13, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని దిగువతొట్టిపల్లి పంచాయతీలోని మబ్బువారిపల్లికి చెందిన గోళ్ళపల్లి రఘునాథ రెడ్డి కుమారుడు గోళ్ళపల్లి కామేష్ రెడ్డి(24) గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు సమీప బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు విచారించగా కామేశ్వర్‌రెడ్డి పురుగుల మందు సేవించి తల్లిదండ్రులు తెలిపారు. వెంటనే వైద్యం కోసం తనకల్లుకు వెళ్ళడంతో అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం అనంతపురం వెళ్ళగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కామేశ్వర్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోయిందని చేతిలో డబ్బులు లేకపోవడంతో ఆ బాధను భరించలేక పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు వారు సమీప బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబాలకు "పల్లె" భరోసా


నివాళులు అర్పిస్తున్న పల్లె

**ఓబుళదేవరచెరువు, జూలై 13, ప్రభాతవార్త**

వివిధ కారణాలతో బాధపడుతూ మృతి చెందిన వారి కుటుంబాలకు పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భరోసా కల్పించారు. శుక్రవారం ఓడీచెరువు మండలంలో పల్లె పర్యటించారు. శ్రీరాములు కొత్తపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బీరే నాయక్ సోదరుడు తావ్రేనాయక్ మృతి చెందిన విషయం తెలుసుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే బత్తినిపల్లి గ్రామానికి చెందిన పెద్ద నరసింహప్ప మృతి చెందడంతో మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని ఆర్థిక సాయం చేశారు. ఎటువంటి కష్టం వచ్చినా తనకు తెలియచేయాలన్నారు. పల్లె వెంట పార్లమెంట్ తెలుగురైతు మీడియా కోఆర్డినేటర్ జాకీర్ అహ్మద్, పార్లమెంట్ తెలుగు యువత జయచంద్రారెడ్డి, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు గండికోట ఇర్షాద్, గ్రామ కమిటీ అధ్యక్షులు శంకరయ్య, నాయకులు చలపతి, పందిపోటు శంకర, షమూన్, బక్షూ, చీమిడి సురేష్ తదితరులు ఉన్నారు.

## ద్విచక్రవాహనం దగ్ధం


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సిఐ

**అమడగూరు, జూలై 13 ప్రభాతవార్త**

మండలంలోని జెకెపల్లి పంచాయతీ తనకంటవారిపల్లి గ్రామానికి చెందిన ధనుంజయ్ కుటుంబ కలహాల నేపథ్యంలో తన అల్లుడైన ధర్మవరం పట్టణానికి చెందిన చిగిచేర్ల సూర్యనారాయణ మోటర్‌సైకిల్‌పై పెద్దబండరాయి వేసి మోటర్‌సైకిల్‌ను పక్కకు లాక్కెళ్లి నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయంపై నల్లమాడ సిఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో అమడగూరు స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐ వెంకటనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా బోధనా కౌశల్యత అలవర్చుకోవాలి

- బళ్లారి వీఎస్‌కే యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్



వీఎస్‌కే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ - గవర్నర్‌చే గౌరవ డాక్టరేట్లు పొందిన ప్రముఖులు

**బళ్లారి, జూలై13, ప్రభాతవార్త**

విద్యారంగంలో రోజురోజుకు సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆధునిక పరిజ్ఞానం అధ్యయనం చేసి, అలవర్చుకొని అధ్యాపకులు తమ బోధనా కౌశల్యతను వృద్ధి చేసుకోవాలని రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. నగరంలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో (వీఎస్‌కే యూనివర్సిటీ)లో గురువారం జరిగిన వార్షిక స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యాభ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం కేవలం డిగ్రీలు పొందడానికి పరిమితం కాకూడదు, ప్రతి వ్యక్తి వ్యక్తిత్వం తన జ్ఞానసముపార్జనపై ఆధారపడి ఉంటుంది. నేటి రోజుల్లో విద్యా స్వరూపం కూడా మారింది. దేశ అభివృద్ధిలో విశ్వవిద్యాలయాలు మహత్తరమైన కార్యం నిర్వహిస్తున్నాయి. మారుతున్న సమయం, సందర్భాలతో నూతన పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక, సామాజిక, నూతన పరిశోధనల గురించి విద్యార్థులకు తెలియజెప్పాలని యూనివర్సిటీ అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. భారత స్వాతంత్ర్యం 75 సంవత్సరాలు పూర్తి చేసుకొని అమృత మహోత్సవాలు జరుపుకున్నది, దేశం అన్ని రంగాల్లో అమోహమైన ప్రగతిని సాధిస్తున్నది, దేశ ఆర్థికత అత్యంత బలిష్టంగా ఉన్నది. మన ఆర్థిక పరిస్థితి ప్రపంచస్థాయిలో ఐదో స్థానంలో ఉండడం గర్వించదగ్గని, దీనిని మూడో స్థానానికి తీసుకొచ్చేందుకు అందరూ కలిసిగట్టుగా అభివృద్ధిబాటలో పయనించాల్సి ఉన్నదన్నారు. మనదేశం యువకుల నుంచి యువశక్తి కలిగిన దేశంగా ఉన్నదని, ప్రపంచలోని అత్యుత్తమ దేశాల జాబితాలోకి భారతదేశాన్ని తీసుకెళ్లే కర్తవ్యం మనది. మనమంతా క్రియాశీలకంగా ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించేందుకు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన ప్రకారం విద్య నుంచి మాత్రమే మానవుడి మెదడును సదుపయోగం చేసుకోవచ్చు అని వ్యాఖ్యానించారని, దేశంలో వ్యక్తి నిర్మాణం, సమాజం ఉన్నతిలో విద్య అత్యంత మహత్తర ప్రాధాన్యతను కలిగి ఉన్నదని, సమాజం, దేశంలో నైతికత కల్పించడంతో పాటు సంస్కృతి, సంరక్షణ, దేశ ఐక్యత, సమగ్రత సమాజంలో సమానత, సౌహార్దతను కాపాడుతున్న విద్యాజ్ఞానాన్ని నేటి యువతరం పొందాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా విద్య నుంచి వ్యక్తిత్వం రూపొందుతుంది. మానసిక ఎదుగుదల లభిస్తుంది. జ్ఞాన సముపార్జన అలవడుతుంది. మనిషి తన సొంత కాళ్లపై నిలబడతాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యను కౌశల్యత, నైతిక విలువలతో జోడించడం ద్వారా సమగ్ర దేశ నిర్మాణానికి యువ సమాజం నడుం కట్టాలని చెప్పారు. బళ్లారి వీఎస్‌కే యూనివర్సిటీలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన విద్యార్థులందరికీ అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. వీఎస్‌కే యూనివర్సిటీ పరిధిలో గల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి ఆయా కళాశాలలకు పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారని, అభివృద్ధిలో వీఎస్‌కే యూనివర్సిటీలో ముందంజలో ఉన్నదన్నారు. న్యూఢిల్లీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసెర్చ్ అధ్యక్షుడు డా.జె.కె.బజాజ్ స్నాతకోత్సవ ప్రసంగంలో మాట్లాడుతూ విజయనగర మహాసామ్రాజ్యం శ్రేష్ట చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయల పేరిట గల విశ్వవిద్యాలయంలో నేడు స్నాతకోత్సవం ప్రసంగం చేస్తుండడం తనకెంతో ప్రత్యేక గౌరవ సందర్భంగా ఉన్నదని, మహారాజు రాయలపేరిట వీఎస్‌కే యూనివర్సిటీ అంచలంచెలుగా ఎదగాలని అభిలషిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిద్ధుపిఅలగూరు, ప్రొఫెసర్ ఎస్.సి.పాటిల్, రమేష్‌మోలేకార్, యూనివర్సిటీ సిండికేట్ సభ్యులు, ముఖ్య అతిథులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా యూనివర్సిటీ గుర్తించిన ముగ్గురు ప్రముఖ సాధకులకు గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ గౌరవ డాక్టరేట్లు అందజేసి అభినందనలు తెలిపారు.

